# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 18 సంచిక: 34 | మంగళవారం, 25 మార్చి 2025 | పేజీలు: 03 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



MHR TV
www.MHRtv.com




## నిర్భయ ఘటన రిపీట్

### హైదరాబాద్‌లో దారుణం

**ఎంఎంటీఎస్‌లో యువతిపై అత్యాచార యత్నం**

**రైలు నుంచి దూకేసిన యువతి**

**గాంధీ ఆస్పత్రిలో చికిత్స.. అనంతరం యశోధకు**

**ఖండించిన విపక్ష నేతలు.. మహిళలకు భద్రత లేదంటూ విమర్శలు**

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లో సంచలనంగా మారిన ఎంఎంటీఎస్ అత్యాచారయత్నం ఘటన కేసులో కీలక విషయాలు వెల్లడించారు రైల్వే పోలీస్ ఎస్పీ చందన దీప్తి. కదులుతున్న ఎంఎంటీఎస్ రైలులో అత్యాచారానికి యత్నించిన దుండగుడి నుంచి తప్పించుకునేందుకు రన్నింగ్ ట్రైన్ నుంచి బయటకు దూకిన బాధితురాలు.. తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. బాధితురాలిని ఎస్పీ చందన దీప్తి పరామర్శించారు. పరామర్శ

మిగతా 2లో..

### ఫోన్ ట్యాపింగ్ కేసులో

## బిగ్ ట్విస్ట్

### వ్యాపారవేత్త, టీవీ చానల్ ఎండీ శ్రవణ్ రావుకు ఊరట

2



**అమెరికాలో రిలాక్స్ అవుతున్న శ్రవణ్ రావు**

**సుప్రీంకోర్టులో అరెస్ట్ నుంచి రక్షణ**

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న వ్యాపారవేత్త, ఓ టీవీ చానల్ ఎండీ అయిన శ్రవణ్ రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించిది. ఆయనపై కఠిన చర్యలు వద్దని.. అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. కేసు నమోదు అయినప్పటి నుంచి శ్రవణ్ రావు పరారీలో ఉన్నారు. ఆయన

## స్టూడెంట్ వీసాలకు కత్తెర

### అమెరికా ప్రభుత్వం కీలక నిర్ణయం

**గత ఏడాది ఏకంగా 41శాతం వీసాలకు కోత**

**ఈ సంవత్సరం రెట్టింపు స్థాయిలో**

**భారతీయ విద్యార్థులకు గట్టి దెబ్బ**

2









## విస్తరణకు వేళాయే

### 6 మంత్రి పదవుల కోసం 20 మంది పోటీ

**సామాజిక సమీకరణాల లెక్కలు తీస్తున్న హైకమాండ్**

**మీనాక్షి నటరాజన్ నివేదిక ఎంతో కీలకం**

**డిప్యూటీ స్పీకర్.. కీలకమైన కార్పొరేషన్ పదవులు కూడా..**

**పనిచేసినోళ్లకే పదవులు**



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం ఎదురు చూస్తున్న వారికి గుడ్ న్యూస్ వినిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు సీనియర్ మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. హైకమాండ్ పిలుపు మేరకు వారు ఢిల్లీ వెళ్లడంతో పదవుల పంపకం కోసం అంతా రంగం సిద్ధమయిందని భావిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఇంకా ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ స్పీకర్ సహా పలు కేబినెట్ ర్యాంక్ హోదా గల కార్పొరేషన్ చైర్మన్ పదవుల

మిగతా 2లో..



2

వడగండ్ల బాధితులకు

## త్వరలో పరిహారం

- ఇటీవల కురిసిన వర్షా లతో భారీ నష్టం
- 11,298 ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తింపు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2

## అభిషేక్ మహంతికి స్వల్ప ఊరట

- రిలీఫ్ ఇచ్చిన హైకోర్టు ధర్మాసనం
- కొంతకాలం పాటు తెలంగాణలోనే..

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణాకు చెందిన ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో స్వల్ప ఊరట లభించింది. క్యాట్‌లో విచారణ ముగిసేంత వరకు అభిషేక్ మహంతి

మిగతా 2లో..



## లాయర్ దారుణహత్య

- పట్టపగలే పొడిచిచంపిన ఎలక్ట్రీషియన్
- మహిళను వేధించొద్దు అన్నందుకు కక్ష
- పోలీసులకు ఫిర్యాదు చేశాడని హత్యకు స్కెచ్
- చంపాపేట డివిజన్ పరిధిలో అమానుష ఘటన

2

## అశుతోష్ అద్భుతం

**ఢిల్లీ క్యాపిటల్స్ ఉత్కంఠ విజయం**

**209 పరుగులు చేసిన లక్నో బ్యాటర్లు**

**బ్యాటింగ్ లో అదరగొట్టి..**

**బౌలింగ్ లో తుస్సుమన్న లక్నో**

**ఉత్కంఠ భరిత మ్యాచ్ లో ఢిల్లీ విన్**

2





## కేసీఆర్ పై చిల్లర రాజకీయం

**గజ్వేల్ ను ఆయన తీర్చిదిద్దారు**

**అభివృద్ధికి కేరాఫ్ గా సొంత నియోజకవర్గం**

**పాదయాత్ర పేరుతో తప్పుడు ప్రచారం**

**రేవంత్ కు గజ్వేల్ మీద ప్రేముంటే అభివృద్ధి చేయండి**

**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**

2



# విస్తరణకు వేళాయే

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయాలని.. వాటిలో తమకు అవకాశాలు కల్పించాలని చాలా మంది నేతలు ఎదురు చూస్తున్నారు.

**ఇరవై మందికిపైగా పోటీ**

ఆరు మంత్రి పదవుల కోసం కనీసం ఇరవై మంది ఎమ్మెల్యేలు గట్టిగా తమ ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలు.. జిల్లాల ప్రయత్నాలు ఇలా అన్ని సమీకరణాలు చూసుకుని పదవులు భర్తీ చేయాల్సి ఉంది. అలా చేయడం వల్ల చాలా మంది అసంతృప్తికి గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి వారిని బుజ్జగించి.. ప్రత్యామ్నాయ పదవులను ఇచ్చేలా ఒప్పించి.. పదవుల భర్తీ చేపట్టనున్నట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే హైకమాండ్ తో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క చర్చించినట్లుగా తెలుస్తోంది.

**రెండు ఖాళీగా ఉంచే చాన్స్**

అన్నీ పదవులను భర్తీ చేయడం వల్ల అసంతృప్తి పెరుగుతుదంని ..నాలుగు పదవుల్ని భర్తీ చేసి రెండు మంత్రి పదవుల్ని ఖాళీగా ఉంచడం ద్వారా ఆశావహుల్ని.. అలా ఆశాహులుగానే ఉండేలా చూసి.. అసంతృప్తి బయటపడకుండా చూడాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఇంకా కార్పొరేషన్ల పదవులపై కూడా చర్చించనున్నట్లుగా చెబుతున్నారు. ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి కొత్త ఇంచార్జ్ గా మీనాక్షి నటరాజన్ వచ్చారు. ఆమె పూర్తిగా పరిస్థితుల్ని అధ్యయనం చేసి.. హైకమాండ్ కు నివేదిక ఇచ్చినట్లుగా తెలుస్తోంది. పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు వస్తాయని ఆమె స్పష్టం చేశారు.


**మీనాక్షి నటరాజన్ నివేదిక ఆధారంగా పదవులు !**

పార్టీ పదవుల్ని సుదీర్ఘంగా పార్టీలో ఉన్నవారికి.. ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారికి.. గెలిచిన తర్వాత పార్టీలో చేరిన వారికి అనే వర్గాల్లో విభజించి అత్యధిక ప్రాధాన్యత సుదీర్ఘంగా పార్టీ లో ఉన్న వారికి ఇవ్వాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు మీనాక్షి నటరాజన్ ఇచ్చిన నివేదిక మేరకు పదవులు ఎవరెవరికి ఇవ్వాలో ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. మొత్తంగా పదవుల కోసం ఎదురు చూస్తున్న వారికి అతి త్వరలోనే గుడ్ న్యూస్ లభించే అవకాశాలు ఉన్నాయి.

# అభిషేక్ మహంతికి స్వల్ప ఊరట

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోనే విధులు నిర్వహించాలని హైకోర్టు ధర్మాసనం సోమవారం (మార్చి 24న) రోజున ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తీర్పుతో అభిషేక్ మహంతికి ఉపశమనం లభించినట్టయింది. అయితే.. తెలంగాణ నుంచి ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీచేస్తూ డీఓపీటీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా.. ఆ ముగ్గురు ఐపీఎస్‌లలో అభిషేక్ మహంతి కూడా ఒకరు. కాగా.. తనను ఆంధ్రప్రదేశ్‌కు పంపించటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అభిషేక్ మహంతి.. క్యాట్‌ను ఆశ్రయించారు. ప్రస్తుతం క్యాట్‌లో అభిషేక్ మహంతి పిటిషన్ మీద విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే.. కేంద్రం గతనెల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలో కేటాయించిన ఆంధ్రప్రదేశ్‌లో విధుల్లో చేరాలని అభిషేక్ మహంతిని ఆదేశిస్తూ కేంద్రం ఉత్తర్వుల్లో పేర్కొంది. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అభిషేక్ మహంతి క్యాట్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన క్యాట్ కేంద్ర ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో.. అభిషేక్ మహంతి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన వేసిన పిటిషన్ మీద జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలాదేవీతో కూడా ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలో డీవోపీటీ జారీ చేసిన ఉత్తర్వులపై క్యాట్‌లో విచారణ ముగిసేంత వరకు అభిషేక్ మహంతి బదిలీని నిలిపేయాలని.. అప్పటి వరకు తెలంగాణలోనే ఆయన విధులు నిర్వహించవచ్చని హైకోర్టు పేర్కొంది. కాగా.. అభిషేక్ మహంతి గురువారం రోజున ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉండగా.. నేటి (మార్చి 24) వరకు కేంద్రం ఉత్తర్వులను నిలిపివేసింది. తెలంగాణలో పని చేస్తోన్న ఆంధ్రప్రదేశ్ కేడర్ అధికారులు డీజీపీ అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిని వెంటనే ఏపీకి




వెళ్లాలని.. ఈ మేరకు ఆదేశాలు ఇవ్వాలని ఫిబ్రవరి 21న తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తక్షణమే ఏపీలో రిపోర్ట్ చేయాలని తెలంగాణ సర్కార్ ఫిబ్రవరి 22వ తేదీన ముగ్గురినీ రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే.. అభిషేక్ మహంతి మాత్రం తనను ట్రాన్స్‌ఫర్ చేయటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

# నిర్భయ ఘటన రిపీట్

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం మీడియాకు కీలక విషయాలు వెల్లడించారు. ఆదివారం (మార్చి 23న) సాయంత్రం 26 ఏళ్ల వయస్సు ఉన్న ఓ యువతి సికింద్రాబాద్ నుంచి మేడ్చల్‌కు వెళ్లేందుకు ఎంఎంటీఎస్ ట్రైన్‌లోని లేడిస్ కంపార్ట్ మెంట్‌లో ఎక్కింది. తాను ఎక్కిన సమయంలో ఆ లేడిస్ కంపార్ట్ మెంట్‌లో మరో ఇద్దరు మహిళలు ఉన్నారు. కాగా.. మధ్యలో ఓ పురుషుడు కూడా ఎక్కాడు. ఆ ఇద్దరు మహిళలు.. అల్వాల్ స్టేషన్‌లో దిగిపోయారు. వాళ్లు దిగిపోగానే.. అదే కంపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆ వ్యక్తి బాధిత యువతి వద్దకు వచ్చి ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

ఆ దుండగుడు ఆమెను తన గదికి రావాలని అడిగాడు. ఒప్పుకుంటే వదిలేస్తాడేమో అని భావించి సరే అని చెప్పింది బాధితురాలు. అప్పటికి వదిలేసినప్పటికీ.. తర్వాత కూడా తనని వదిలిపెట్టడేమో.. ఏమైనా చేస్తాడేమో అన్న భయంతో.. ఎలాగైనా అతని నుంచి తప్పించుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో.. రన్నింగ్ ట్రైన్ నుంచి కిందకు దూకేసింది. దీంతో.. తీవ్రగాయాలపాలైన బాధితురాలు అక్కడే స్పృహ కోల్పోగా.. ఆస్పత్రికి వచ్చిన తర్వాతే కళ్లు తెరిచిందని ఎస్పీ చందనా దీప్తి వివరించారు. అయితే.. బాధితురాలు నిందితుడిని గుర్తుపట్టలేనని చెబుతుందని.. కానీ అతడు రైలు ఎక్కిన ప్రాంతం మాత్రం గుర్తుందని చెప్పిందని ఎస్పీ తెలిపారు. ఆమె చెప్పిన ఆధారాలను పరిగణలోకి తీసుకుని విచారణను ముమ్మరం చేసినట్టు ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిందన్నారు. నిందితున్ని పట్టుకునేందుకు 4 ప్రత్యేక దళాలు ఏర్పాటు చేసినట్టు చందనా దీప్తి తెలిపారు. కాగా.. బాధితురాలిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా పరామర్శించారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలితో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె ఆరోగ్యంపై ఆరా తీసి.. మెరుగైన వైద్యం కోసం యశోద ఆస్పత్రికి తరలించనున్నట్టు హామీ ఇచ్చారు.

**బలవంతం చేయబోతే రైలు నుంచి దూకేసిన యువతి**

బాధిత యువతిని పరామర్శించిన అనంతరం జీఆర్పీ ఎస్పీ చందన దీప్తి మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 22న యువతి సికింద్రాబాద్ వెళ్లింది. తన పని పూర్తి చేసుకుని సికింద్రాబాద్ లో తిరిగి ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. మహిళా కంపార్ట్‌మెంట్లోనే బాధితు



యువతి ప్రయాణించింది. అల్వాల్ వద్ద కంపార్ట్ మెంట్లో ఉన్న మరో ఇద్దరు మహిళలు దిగిపోయారు. అదే కంపార్ట్ మెంట్లో ఉన్న ఓ యువకుడు యువతి వద్దకు వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించాడు. తనతో ఏకాంతంగా గడపాలని, తాను చెప్పిన రూముకు రావాలని బలవంతం చేశాడని బాధితురాలు తెలిపింది. అతడు రైలు ఎక్కడ ఎక్కాడో అంతగా ఐడియా లేదు కానీ తన చేయి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో ప్రతిఘటించింది. నిందితుడి నుంచి తప్పించుకునే క్రమంలో సుచిత్ర సమీపంలో ఎంఎంటీఎస్ రైలు నుంచి కిందకి దూకేసింది. తరువాత బాధిత యువతి స్పృహ కోల్పోయింది.

**యువతికి తప్పిన ప్రాణాపాయం**

తాను కళ్లు తెరిచి చూసేసరికి ఆస్పత్రిలో ఉన్నానని ఆమె చెబుతోంది. తనకు ఏమైనా జరుగుతుందని, నిందితుడు తనను వదిలి పెట్టడేమోనన్న భయంతో ఎంఎంటీఎస్ రైలు నుంచి కిందకి దూకినట్లు మాత్రం బాధితురాలికి గుర్తుంది. నిందితుడు తన వద్దకు వచ్చి చేయి పట్టుకున్న సమయంలో తాను డయల్ 100కు కాల్ చేసింది. అంతలోనే కదులుతున్న రైలు నుంచి కిందకి దూకేసింది. యువతికి ప్రాణాపాయం తప్పింది. కానీ ఆ ఘటనతో షాక్‌లోకి వెళ్లింది. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటోంది. సున్నితమైన ఘటన కనుక ఆమె వివరాలు పోలీస్ శాఖ బహిర్గతం చేయడం లేదు. బాధితురాలి నుంచి సమాచారం సేకరించిన పోలీసులు నిందితుడ్ని అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు ముమ్మరం చేశాం. నాలుగు ప్రత్యేక టీంలతో నిందితుడ్ని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని ఎస్పీ చందన దీప్తి తెలిపారు. మహిళలు బస్సులు, రైళ్లలో ప్రయాణించినా జాగ్రత్తగా ఉండాలని.. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా పోలీసులకు, షీ టీమ్స్‌కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

**అసలేం జరిగిందంటే..**

ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన యువతి (23) ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చింది. ఒక ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్న యువతి మేడ్చల్ లో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో తన సెల్ ఫోన్ రిపేర్ చేయించుకుందామని మార్చి 22న సికింద్రాబాద్ కు వెళ్లింది. రిపేర్ వర్క్ అయిపోవడంతో మేడ్చల్ వెళ్లేందుకు సికింద్రాబాద్ లో ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. మహిళల కోచ్‌లోనే ఎక్కి ప్రయాణించగా.. అల్వాల్ స్టేషన్ లో ఇద్దరు మహిళలు దిగిపోయారు. ఆ లేడిస్ కంపార్ట్‌మెంట్లో ఉన్న దాదాపు 25 ఏళ్ల యువకుడు ఒంటరిగా ఉన్న యువతిపై కన్నేశాడు. రైలు కదలగానే ఆమె వద్దకు వెళ్లి చెయ్యి పట్టుకుని బలవంతం చేయబోయాడు. తనతో ఏకాంతంగా గడపాలని, తన కోరిక తీర్చాలని వేధిస్తూ ఆమెను విడిచిపెట్టడం లేదు. తనపై అత్యాచారయత్నం చేస్తాడని భయంతో ప్రతిఘటించిన యువతి కదులుతున్న ఎంఎంటీఎస్ రైలు నుంచి దూకేసింది. సుచిత్ర సమీపంలో దూకిన యువతికి తీవ్ర గాయాలు కాగా, గాంధీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికాలో ఉన్నారని భావిస్తున్నారు. ఇటీవల శ్రవణ్ రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. దాంతో బలవంతంగా ఆయనను అమెరికా నుంచి డిపోర్ట్ చేసే అవకాశం ఏర్పడింది. ఈ క్రమంలో ఆయన ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో అరెస్టు నుంచి రక్షణ లభించడంతో ఆయన నెలాఖరులో విదేశాల నుంచి ఇండియాకు తిరిగి వచ్చే అవకాశం ఉంది. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ 1 నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు కూడా తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే కౌంటర్ దాఖలకు ప్రభుత్వం రెండు వారాల గడువు కోరడంతో విచారణ వాయిదా పడింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇతర నిందితులు అరెస్టు అయి చాలా కాలం పాటు జైల్లో ఉన్నారు. ఇటీవలే వారికి బెయిల్ లభిచింది. ప్రస్తుతం ట్యాపింగ్ కేసులో ఎవరూ జైల్లో లేరు. అయితే విదేశాలకు పారిపోయిన ప్రభాకర్ రావే అత్యంత కీలకం అని.. ఆయన తో పాటు శ్రవణ్ రావు ఇండియాకు రాగానే .. వారితో పాటు కేసీఆర్, కేటీఆర్‌లను కూడా అరెస్టు చేస్తామని ఇటీవల రేవంత్ రెడ్డి ప్రకటించారు. వారిని కాపాడుతోంది బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమేనని కూడా ఆరోపణుల చేశారు. ఈ క్రమంలో వారిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. అమెరికాతో నేరస్తుల అప్పగింత ఒప్పందం ఉండటంతో వారిని ఇక ఇండియాకు అప్పగిస్తారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇలాంటి సమయంలో వారు వచ్చినా అరెస్టు చేయకుండా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇందులో శ్రవణ్ రావు సక్సెస్ అయ్యారు. శ్రవణ్ రావు ఓ టీవీ చానల్ కు ఎండీగా వ్యవహరిస్తున్నారు. ఆయనతటీవీ చానల్ కార్యాలయంలోనే ఓ సర్వస్ మెయిన్ టెయిన్ చేసేవారని.. ట్యాపింగ్ కోసమే దానిని ఉపయోగించేవారని దర్యాప్తులో పోలీసులు అధికారులు కనుగొన్నారు. ప్రభాకర్ రావు ఇంటలిజెన్స్ ఓఎస్డీగా పూర్తి స్థాయిలో ట్యాపింగ్ మీదే పని చేసేవారని అంటున్నారు. ఇతరులు ఇచ్చిన వాంగ్మూలాలతో.. ప్రభుత్వం మారగానే కేసులు నమోదయ్యాయి. ట్యాపింగ్ సాక్ష్యాలను తారుమారు చేయడానికి మొత్తం హార్డ్ డిస్కుల్ని ధ్వంసం చేయడంతో.. ఇతర కాన్ఫిడెన్షియల్ సమాచారం కూడా డిలీట్ అయిందని కేసులు నమోదు చేశారు.

**కీలక మలుపులు చోటు చేసుకొనే చాన్స్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకూ పరారీలో ఉన్నట్లుగా భావిస్తున్న ఇద్దరూ ముందస్తు బెయిల్ తో లేదా అరెస్టు నుంచి రక్షణ తీసుకుని నెలాఖరులోగా లేదా ఆ తర్వాత అయినా ఇండియాకు తిరిగి రానున్నారు. దర్యాప్తునకు సహకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపులు చోటు చేసుకునే అవకాశాలను కొట్టిపారేయలేమని భావిస్తున్నారు.

## వడగండ్ల బాధితులకు త్వరలో పరిహారం

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :


తెలంగాణలో గత మూడ్రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. వడగళ్ల వాన రైతులకు కడగండ్లు మిగుల్చుతున్నాయి. మార్చి 21 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పంట నష్టం వాటిల్లింది. వడగళ్ల వానతో పొట్ట దశలోని ధాన్యపు గింజలు, మామిడి పూత, కాయలు నేలరాలాయి. మొక్కజొన్న, వరి పంటలు నేలవాలిపోయాయి. ఇన్నాళ్లూ కంటిరెప్పలా కాపాడుకున్న పంట పది నిమిషాల్లో నేలపాలైదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కన్నీరు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పంట నష్టాన్ని అంచనా వేయాలని రెండ్రోజుల క్రితం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. తాజాగా.. వడగళ్ల వానలతో సంభవించిన పంట నష్టంపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. 13 జిల్లాల్లోని 64 మండలాల్లో 11,298 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,670 ఎకరాల్లో వరి, 4,100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందని చెప్పారు. 309 ఎకరాల్లో మామిడి, ఇతర పంటలకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి తుది నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పూర్తి నివేదిక వచ్చాక పరిహారం చెల్లింపునకు చర్యలు చేపడతామని తుమ్మల తెలిపారు.

# లాయర్ దారుణహత్య

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

హైదరాబాద్‌లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పట్టపగలే ఓ లాయర్‌ను ఎలక్ట్రీషియన్ అత్యంత కిరాతకంగా పొడిచి చంపేశాడు. ఒక లాయర్‌ను ఓ ఎలక్ట్రీషియన్ అంత కసితో కత్తితో పొడిచి చంపాడంటే.. ఏ ఆస్తి తగాదాలోనో, ఫ్యామిలీకి సంబంధించిన వివాదంలోనో తనకు వ్యతిరేకంగా వాదిస్తున్నాడన్న కోపం అయ్యుంటుందని అనుకుంటే పొరపాటు పడ్డట్టే. ఆ నిందుతుడు లాయర్‌ను చంపేయడానికి కారణం.. ఒక మహిళ కావటం గమనార్హం. ఒక ఎలక్ట్రీషియన్ ఏకంగా ఓ లాయర్‌ను హత్య చేసేందుకు కారణమైన ఆ మహిళ ఎవరు.. అసలు ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందని తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..!

చంపాపేట డివిజన్ ఐఎస్ సదన్‌లోని అంబేద్కర్‌వాడలో ఇజ్రాయెల్ అనే న్యాయవాది ఉంటారు. అయితే.. ఇజ్రాయెల్ ఇంట్లో ఓ మహిళ అద్దెకుంటోంది. ఆ మహిళపై.. దస్తగిరి అనే ఎలక్ట్రీషియన్ కన్నేశాడు. రకరకాలమార్గాల్లో ఆమెను దస్తగిరి వేధిస్తున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెప్పినా, బయట తెలిసినా తనకు ఇబ్బంది అవుతుందని భావించిన ఆ మహిళ.. చాలా రోజుల పాటు ఓపికపట్టింది. కానీ.. దస్తగిరి నుంచి వేధింపులు వస్తూనే ఉన్నాయి. ఇక ఓపికపట్టి లాభం లేదని భావించిన మహిళ.. తమ ఇంటి ఓనర్ లాయరే కదా.. ఆయనతో ఈ విషయం పంచుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావించింది. ఇజ్రాయెట్ ఫ్రీగా ఉన్న సమయంలో వెళ్లి.. తాను ఎదుర్కుంటున్న ఇబ్బందిని ఆయనతో వివరించింది. ఆ మహిళ పడుతున్న బాధ విన్న లాయర్ ఇజ్రాయెల్.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో.. పోలీసులు దస్తగిరిని తమదైన శైలిలో మం



దలించారు. ఇక అప్పటి నుంచి లాయర్ ఇజ్రాయెల్ మీద దస్తగిరి కక్ష పెంచుకున్నాడు. సమయం చూసి లాయర్‌ను ఏసెయ్యాలని భావించాడు. తనపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా.. అంటూ ఆదివారం (మార్చి 23న) ఉదయం అందరూ చూస్తుండగానే ఇజ్రాయెల్ మీద కత్తితో దాడి చేశాడు దస్తగిరి. ఈ దాడిలో తీవ్రంగా లాయర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి లాయర్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కాగా.. చికిత్స పొందుతూ ఇజ్రాయెల్ ప్రాణాలు వదిలారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మహిళ విషయంలో లాయర్ ఇజ్రాయెల్ ఫిర్యాదు చేయటం వల్లే దస్తగిరి ఇంత దారుణానికి పాల్పడినట్టుగా స్థానికులు చెప్తున్నారు. కాగా.. నిందితుడు దస్తగిరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. అయితే.. పట్టపగలే అందరూ చూస్తుండగా హత్య జరగటంతో.. స్థానికులు హడలెత్తిపోతున్నారు.

# అశుతోష్ అద్భుతం

స్పోర్ట్స్, ప్రజాస్వరం :

ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం సాధించింది. సోమవారం విశాఖపట్నంలోని ఏసీఏ, వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్.. లక్నో సూపర్ జెయింట్స్ పై వికెట్ తేడాతో విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన లక్నోకు బ్యాటర్లు సూపర్ స్కోరు అందించారు. నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 209 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (30 బంతుల్లో 75, 6 ఫోర్లు, 7 సిక్సర్లు) తో పూనకం వచ్చినట్లు రెచ్చిపోయాడు. అంతకుముందు ఓపెనర్ మిషెల్ మార్ష్ (36 బంతుల్లో 72, 6 ఫోర్లు, 6 సిక్సర్లు) అద్భుతమైన ఫిఫ్టీ చేశాడు. బౌలర్లలో మిషెల్ స్టార్క్ కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో అశుతోష్ శర్మ (31 బంతుల్లో 66 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అజేయ ఫిఫ్టీతో పోరాడటంతో ఢిల్లీ గెలిచింది. 19.3 ఓవర్లలో 9 వికెట్లకు 211 పరుగులు చేసింది. కొత్త ప్లేయర్ విప్రజ్ నిగమ్ (15 బంతుల్లో 39, 5 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కాసేపు లక్నోను వణికించాడు. బౌలర్లలో దిగ్వేశ్ రాఠీ (231) పొదుపుగా బౌలింగ్ చేశాడు. ఢిల్లీ చరిత్రలో ఇది అత్యధిక చేధన కావడం విశేషం. 2017లో గుజరాత్ లయన్స్ పై 209 పరుగుల ఛేదనను చేయగా, తాజాగా దాన్ని సవరించుకుంది.

**65-5 నుంచి ఛేజింగ్..**

భారీ టార్గెట్ ఛేజింగ్ కోసం బ్యాటింగ్ కు వచ్చిన ఢిల్లీకి చేదు అనుభవం ఎదురైంది. ఓపెనర్ మెక్ గర్క్ (1), అభిషేక్ పోరెల్ డకౌట్, సమీర్ రిజ్వీ (4), కెప్టెన్ అక్షర్ పటేల్ (22)లతోపాటు కాసేపు పోరాడిన ఓపెనర్ ఫాఫ్ డుప్లెసిస్ (29) త్వరగా ఔటయ్యారు. దీంతో 655తో ఢిల్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో ట్రిస్టన్ స్టబ్స్ (34)తో కలిసి అశుతోష్, జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ లక్నో బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవడంతో ఢిల్లీ గాడిన పడింది. అయితే మ్యాచ్ మధ్యలో స్టబ్స్ రెండు సిక్సర్లు బాదిన తర్వాత ఆ బంతి కనపడకుండా పోవడంతో, కొత్త బంతిని మార్చారు. ఆ తర్వాతి బంతికే స్టబ్స్ ఔటవడంతో ఢిల్లీ మళ్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో విప్రజ్ మెరుపు కామియో ఆడటంతో ఢిల్లీకి ఆశలు చిగురించాయి. అయితే విజయానికి 42 పరుగులు అవసరమైన దశలో తను వెనుదిరగడంతో ఢిల్లీ గెలవడం కష్టమే అనిపించింది. ఈ దశలోనే తనలోని సిసలైన ఫినిషర్‌ను బయటకు తీసిన అశుతోష్.. భారీ బౌండరీలు బాది స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. చివరి ఓవర్లో రిషభ్ పంత్.. మోహిత్ శర్మను స్టంపౌట్ మిస్ చేయడం కూడా కలిసి రావడంతో, ఆ తర్వాత భారీ సిక్సర్ ను బాది అశుతోష్ ఢిల్లీకి అద్భుత విజయాన్ని అందించాడు. దీంతో అతనికే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. మిగతా బౌలర్లలో శార్దూల్ ఠాకూర్, సిద్ధార్థ్, రవి బిష్ణోయ్ లకు తలో రెండు వికెట్లు దక్కాయి. ఈ మ్యాచ్ లో పంత్ కెప్టెన్సీ లోపాలు కూడా లక్నో పాలిట శాపంగా మారాయి. బౌలర్లను తెలివిగా ఉపయోగించక, గాంబ్లింగ్ ఆడటం బెడిసికొట్టింది.

# స్టూడెంట్ వీసాలకు కత్తెర

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

విదేశాల్లో పైచదువులు చదవాలన్నది చాలామంది కల. అందులోనూ అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించేందుకు మరింత ఎక్కువ ఇష్టపడుతుంటారు. అలా చాలా దేశాల నుంచి ఏటా ఎంతోమంది విద్యార్థులు అగ్రరాజ్యానికి వెళ్తుంటారు. అయితే, గత కొంతకాలంగా ఈ విద్యార్థి వీసాల (ఎఫ్1 వీసా) సంఖ్యకు అమెరికా సర్కారు భారీగా కత్తెర వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41శాతం వీసా దరఖాస్తులను తిరస్కరించింది. దశాబ్దం క్రితంతో పోలిస్తే ఎఫ్1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 202324 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో 2.79 లక్షల (దాదాపు 41శాతం) దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అంతకుముందు 202223 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షల (36శాతం) అప్లికేషన్లకు అధికారులు ఆమోదం తెలపలేదు. 201314 ఆర్థిక సంవత్సరంలో 7.69 లక్షల మంది విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. 1.73లక్షల (23శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాటితో పోలిస్తే గతేడాది సంఖ్య దాదాపు రెట్టింపుగా ఉంది. అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన వారి సంఖ్యను అమెరికా వెల్లడించలేదు. కానీ, గతేడాది డిసెంబరు 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు ఎఫ్1 వీసాలు 38శాతం తగ్గినట్లు తెలిసింది. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబరు మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం. హెచ్1బీ వీసా వ్యవస్థలో మార్పులు.. పాత రికార్డులన్నీ తొలగింపు ఏంటీ ఎఫ్1 వీసా? ఎఫ్1 వీసా అనేది నాన్‌ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. విద్యా సంస్థలు ఏటా రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే మన విద్యార్థులు అధికంగా వెళ్తుంటారు.

# కేసీఆర్ పై చిల్లర రాజకీయం

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

కేసీఆర్‌పై ముప్పేట దాడి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మక ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా గజ్వేల్ లో కేసీఆర్ కు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు. ఆయన అసలు కనిపించడం లేదని గజ్వేల్ ను గాలికొదిలేశారని అంటున్నారు. పాదయాత్రగా వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. అసెంబ్లీకి హాజరుకాని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శాసనసభా సభ్యత్వాన్ని రద్దు చేయాలని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రేవంత్ ను కోరారు. కాంగ్రెస్ నేత నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరిగింది. అలాగే రాజ్ భవన్ వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం అందించాలని నిర్ణయించారు. అయితే కాంగ్రెస్ నేతల తీరుపై హరీష్ రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలకు, దిగజారుడు, దివాళాకోరు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ గజ్వేల్ ను తెలంగాణలో ఇతర పట్టణాలకు ఆదర్శంగా తీర్చిదిద్దారని.. ఇవాళ గజ్వేల్ ను సకల సౌకర్యాలతో అలరారే ఒక ఆదర్శ పట్టణంగా ఉందన్నారు. ఒకప్పుడు గజ్వేల్ అంటే కక్షలు, కుట్రలు, భౌతిక దాడులు, పోలీస్ కేసులు ఇప్పుడు గజ్వేల్ ను ప్రేమ, అభిమానాలకు, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా మార్చారన్నారు. దేశ ప్రధానమంత్రిని కూడా గజ్వేల్ కు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్ దేన్నారు. గజ్వేల్ లో తాగు, సాగునీటి కొరతను కేసీఆర్ తీర్చారన్నారు. ఎకరం 45 లక్షల్లేని భూముల ధరలు 1 కోటి నుంచి 4 కోట్ల వరకు పెరిగాయి. ఇవాళ రేవంత్ రెడ్డి దరిద్రపు పాలన వల్ల గజ్వేల్లో ధనలక్ష్మి మాయమైపోతున్నది, భూముల ధరలు పడిపోతున్నయన్నారు. ఎవరికన్నా ఆపద ఉండి అమ్ముకుందామంటే, కొనే దిక్కు లేకుండా అయిపోయిందన్నారు. కేసీఆర్ రాకముందు గజ్వేల్లో పాఠశాలలు పాత బూత్ బంగ్లాల వలె ఉండేవి. ఇప్పుడు బ్రహ్మాండమైన ఎడ్యుకేషన్ హబ్ గా మారిందన్నారు. యూనివర్సిటీలతో, కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడేలా ఫారెస్ట్ యూనివర్సిటీ, హార్టి కల్చర్ యూనివర్సిటీ, గురుకుల పాఠశాలలతో సరస్వతీ నిలయంగా తీర్చిదిద్దారని.. ఎక్కడ గోదావరి ఎక్కడ పాండవుల చెరువని ప్రశ్నించారు. ఆనాడు విడాకుల పంచాయతీలకు కేరాఫ్ అడ్రస్ ఉండేది ఈ చెరువు .. ఇవాళ పసిపిల్లలు సాయంత్రం పూట కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నరని గుర్తు చేశారు. గజ్వేల్ కు కేసీఆర్ కు మధ్య ఉండేది తల్లీ బిడ్డల అనుబంధమని హరీష్ స్పష్టం చేశారు. రేవంత్ పాలనలో గజ్వేల్ కు 1 రూపాయి పని అయినా చేస్తే చెప్పాలన్నారు. కేసీఆర్ మంజూరు చేస్తే, టెండర్లు అయి, నడుస్తున్న 181 కోట్ల రూపాయల పనులు రద్దు చేశారని ఆరోపించారు. గజ్వేల్ అభివృద్ధి మీద ఏడ్చినవు, కుళ్లినవు, ఇవాళ సీఎం అయినంక కూడా అదే ఏడుపా అని ప్రశ్నించారు. గజ్వేల్ మీద కేసీఆర్ గారిది కన్నతండ్రి ప్రేమ రేవంత్ ది సవతి తల్లి ప్రేమ అని.. నిజం కాకపోతే ఆపేసిన పనులను ప్రారంభించాలన్నారు. కేసీఆర్ గజ్వేల్ లో కూడా పర్యటించకపోవడంతో ఈ రాజకీయం మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బాలీవుడ్‌కి మహానటి గ్రీన్ సిగ్నల్

మహానటి ఇమేజ్ వల్ల టాలీవుడ్‌లో గిరిగీసుకుని వర్క్ చేసింది కీర్తి సురేష్. నో ఎక్స్ పోజింగ్ అని చెప్పేసింది. మొన్నటి వరకు పద్ధతిగా నటించిన కీర్తి సురేష్ బాలీవుడ్ చెక్కేశాక గ్లామర్ డోర్స్ తెరిచేసింది. సౌత్‌లో ఎక్స్ పోజింగ్‌కు నో చెప్పిన మహానటి నార్త్ బెల్ట్‌కు ఇలా వెళ్లిందో లేదో బేబీ జాన్‌తో రూల్స్ బ్రేక్ చేసింది. పెళ్లి తర్వాత చేయలేనేమో అనుకుందేమో ఏమో అందాలన్నీ ఆరబోసింది. కానీ వ్రతం చెడినా ఫలితం దక్కలేదు మలయాళ బ్యూటీకి. బేబీ జాన్ డిజాస్టర్ బాలీవుడ్ కెరీర్ డైలమాలో పడేట్లు చేసింది. ఇక బేబీ జాన్ కన్నా ముందే అక్కా అనే వెబ్ సిరీస్ చేసింది కీర్తి. రీసెంట్లీ టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో బోల్డ్ లుక్కులో రా అండ్ రస్టిక్ క్యారెక్టర్‌లో దర్శనమిచ్చింది. ఇప్పటి వరకు ఎన్నో లేడీ ఓరియెంట్ చిత్రాల్లో నటించింది కీర్తి కానీ ఆ సినిమాలలతో పోల్చుకుంటే ఈ సిరీస్‌లో డిఫరెంట్‌గా కనిపిస్తోంది. సౌత్‌లో హోమ్లీ గర్ల్‌గా ముద్ర పడటం వల్లో ఏమో నార్త్ బెల్ట్‌లోకి వెళ్లగానే గ్లామర్, ఎక్స్ పోజింగ్ హీరోలతో ఓవర్ రొమాన్స్ చేసింది మేడమ్. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి పీటలు ఎక్కింది కీర్తి. లాస్ట్ ఇయర్ ఎండింగ్‌లో ఆంటోనీ థాటిల్ ను వివాహం చేసుకుని.. సెట్స్, షూటింగ్స్ కు కాస్త బ్రేక్ ఇచ్చింది. ఇప్పుడు మళ్లీ కెరీర్‌పై ఫోకస్ చేస్తోంది. ఈ సారి బాలీవుడ్‌పై కాన్సట్రేషన్ పెడుతోంది. హిందీలో ఓ రామ్ కామ్ మూవీకి కమిటైనట్లు టాక్. ఇవే కాకుండా తమిళంలో రివాల్వర్ రీటా, కన్నివీడి చేస్తుంది. తెలుగులో భోళా శంకర్ తర్వాత కల్కికి బుజ్జికి వాయిస్ ఇచ్చింది తప్ప మరో కొత్త సినిమాకు సైన్ చేసిన దాఖలాలు లేవు.



# ప్రభాస్, పవన్ స్టార్‌ను చేస్తారా?

ఒక హీరోయిన్ స్టార్ కావాలంటే ఒకటి, రెండు పెద్ద హిట్లు కచ్చితంగా కావాలి. అందులోనూ ఇప్పుడు పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది కాబట్టి.. పాన్ ఇండియా సినిమాల్లో నటించి హిట్ కొట్టాల్సిందే. అప్పుడు ఒకేసారి నేషనల్ వైడ్ గా పాపులర్ అయిపోవచ్చు. ఇప్పుడు నిధి అగర్వాల్ కూడా రెండు భారీ సినిమాలపై ఆశలు పెట్టుకుంది. అందులో ఒకటి పవన్ కల్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమా, ఇంకొకటి రెబల్ స్టార్ ప్రభాస్ తో చేస్తున్న ది రాజాసాబ్ మూవీ. ఈ రెండింటిలోనూ ఏది హిట్ అయినా ఆమె దశ తిరిగిపోతుంది.
హరిహరి వీరమల్లు సినిమా మే 9న రాబోతోంది.
ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.
చాలా కాలం తర్వాత పవన్ కల్యాణ్ నుంచి వస్తున్న సినిమా ఇది. ఏ కొంచెం హిట్ టాక్ వచ్చినా వసూళ్లను ఆపడం కష్టమే. అటు ది రాజాసాబ్ మూవీని కూడా ఈ సమ్మర్ లోనే రిలీజ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.
ఈ సినిమా హర్రర్ కథతో వస్తోంది. ఇది కూడా హిట్ టాక్ తెచ్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.
ఈ మూవీ ఏ కొంచెం హిట్ అయినా సరే నిధి అగర్వాల్ కు స్టార్ ఇమేజ్ రావడం పక్కా అంటున్నారు సినిమా నిపుణులు.



# అగ్రహీరోలపై ఫిర్యాదు



తెలుగు రాష్ట్రాల్లో ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రచారంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినీ ఇండస్ట్రీకి చెందిన స్టార్ హీరోలు ఈ యాప్స్‌ను ప్రమోట్ చేయడం, వారి ఇమేజ్‌ను ఉపయోగించి ప్రజలను ఆకర్షించడం ఇప్పుడు చర్చకు దారితీసింది. ఈ వివాదంలో నందమూరి బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌లు ప్రధాన పాత్ర పోషించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు చిత్రసీమలో అగ్రస్థానంలో ఉన్న బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌లు ఇటీవల "Fun88" అనే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆహా ఓటీటీ వేదికపై ప్రసారమైన 'Unstoppable Season 2' షోలో ఈ యాప్‌కు ప్రమోషన్ ఇచ్చారని మారేడుపల్లి పోలీస్ స్టేషన్‌లో రామారావు ఇమ్మనేని అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో, "ఈ స్టార్ హీరోల ప్రమోషన్ కారణంగా చాలా మంది అమాయక ప్రజలు డబ్బులు పోగొట్టుకున్నారు. లక్షలాది మంది ఆర్థికంగా నష్టపోయారు. అందుకే సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ల కింద వీరి పై కేసు నమోదు చేయాలని" ఆయన పోలీసులను కోరారు. బాలీవుడ్‌తో పోటీ పడుతూ, తమ సినిమాల ద్వారా వందల కోట్ల వసూళ్లు సాధిస్తున్న ఈ హీరోలు, సినిమా, యాడ్స్, ఇతర వ్యాపారాల ద్వారా ఇప్పటికే వేల కోట్ల ఆస్తులను సంపాదించారు. అయినప్పటికీ, ఇలా ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడం ఏమిటి? ప్రజలకు మంచిని అందించాలి గానీ, ఇలా డబ్బు కోసమే ప్రవర్తించడం తగదా? అంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజలకు నష్టం వచ్చినా, వాళ్ల ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా, ఇలాంటి యాప్‌లను ప్రమోట్ చేయడం బాధాకరం. వాళ్లు నిజంగా బాధ్యతగల సెలబ్రిటీలు అయితే, వెంటనే స్పందించి ఈ యాప్స్ ప్రమోషన్‌ను ఉపసంహరించుకోవాలి" అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఈ కేసుపై పోలీసులు విచారణ ప్రారంభించారు. భారత్‌లో ఆన్లైన్ బెట్టింగ్ నిషేధితమైనా, విదేశీ సంస్థలు యాప్‌ల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. ప్రముఖులు వీటిని ప్రమోట్ చేయడం ద్వారా చాలా మంది ఆర్థికంగా నష్టపోతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌లు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి. అయితే, సెలబ్రిటీల బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ అవసరం అనే డిమాండ్ ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తోంది.

# వాళ్లు క్షమాపణలు చెప్పాల్సిందే

మంచు లక్ష్మీ తాజాగా చేసిన పోస్టు సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఆమె ఈ నడుమ కొంచెం సైలెంట్ గానే ఉంటోంది. మంచు ఫ్యామిలీలో గొడవలతో పాటు ఆమెపై బెట్టింగ్ యాప్స్ కేసు నమోదు కావడంతో సైలెంట్ అయిపోయింది. ఇలాంటి టైమ్ లో ఆమె చేసిన ఓ సెన్సేషనల్ పోస్టు వైరల్ అవుతోంది. దివంగత హీరో సుశాంత్ సింగ్ రాజ్ పుత్ కేసులో మాజీ ప్రేయసి రియా చక్రవర్తికి క్లీన్ చిట్ ఇచ్చింది సీబీఐ. ఆమె ప్రమేయం లేదని చెప్పి కేసును క్లోజ్ చేసిన సంగతి తెలిసిందే కదా. అయితే ఆమెకు మద్దతుగా మంచు లక్ష్మీ పోస్టు చేసింది. 'నిజాన్ని ఎవరూ దాచలేరు. రియా చక్రవర్తి ఎలాంటి తప్పు చేయకపోయినా శిక్ష అనుభవించింది. ఒక కుటుంబాన్ని అనవసరంగా నిందించారు. ఆ కుటుంబం ఎంత మనోవేధన అనుభవించిందో ఒకసారి ఆలోచించండి. ఆమెను నిందించిన వారంతా ఆమెకు క్షమాపణలు చెప్పాలి' అంటూ మంచు లక్ష్మీ రాసుకొచ్చింది. ఆమె చేసిన ఈ పోస్టు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రియా చక్రవర్తికి సోషల్ మీడియాలో భారీగా మద్దతు పెరుగుతోంది. ఆమెకు సపోర్టు చేస్తూ వేలాది పోస్టులు వెలుస్తున్నాయి. సుశాంత్ ఆత్మహత్య చేసుకునేలా ఆమె ప్రోత్సహించలేదని సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే.



# చిల్ అవుతున్న స్టార్స్

జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇప్పుడు ఫుల్ స్వింగ్ లో ఉన్నారు. వీరిద్దరూ ఓ భారీ సినిమా చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లోని పలు లొకేషన్లలో ఈ మూవీ షూట్ చేస్తున్నారు ప్రశాంత్ నీల్. అయితే షూటింగ్ నుంచి వీరిద్దరూ కొంచెం బ్రేక్ తీసుకున్నట్టు తెలుస్తోంది. శనివారం సాయంత్రం ఎన్టీఆర్ తన ఇంట్లో ప్రశాంత్ నీల్ కు స్పెషల్ పార్టీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ సాయంత్రం కబుర్లు చెప్పుకుంటూ చిల్ అవుతున్న ఫొటోను ప్రశాంత్ నీల్ భార్య లిఖిత ఇన్ స్టాలో పోస్టు చేసింది. ఆ ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. వీరిద్దరినీ ఇలా చూస్తే భయం అనేది మాత్రమే గుర్తుకు వస్తోంది అన్నట్టు ఆమె క్యాప్షన్ ఇచ్చారు. ఇంకేముంది ఈ ఫొటోను ఎన్టీఆర్ ఫ్యాన్స్ తెగ షేర్ చేస్తూ.. మూవీ భారీ హిట్ ఖాయం అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఎన్టీఆర్ దేవర సినిమా ప్రమోషన్స్ కోసం జపాన్ కు వెళ్లారు. ప్రస్తుతం అక్కడ పర్యటిస్తున్నారు. ఆ తర్వాత వాళ్లు తిరిగి వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వచ్చాక మళ్లీ ప్రశాంత్ నీల్ మూవీ షూటింగ్ లో ఎన్టీఆర్ పాల్గొంటారు. ఇంకోవైపు వార్ 2 మూవీ షూటింగ్ కూడా త్వరలోనే మళ్లీ స్టార్ట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999